నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 26 జనవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## గూడెంలో పౌర్ణమి సందడి

సత్యనారాయణస్వామి వ్రతం ఆచరిస్తున్న భక్తులు

దండేపల్లి, జనవరి 25 : మండలంలోని గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో పుష్య పౌర్ణమి సందర్భంగా గురువారం భక్తుల సందడి కనిపించింది. వేకువజామునే పవిత్ర గోదావరినదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. పూజల అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. గోదావరిలో భక్తులు గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

పొనకల్‌లో నాటువేస్తున్న కూలీలు

## జోరుగా వరి నాట్లు

జన్నారం, జనవరి 25 : మండలంలో యాసంగి సాగు జోరుగా సాగుతున్నది. ఈ యేడాది 29 గ్రామ పంచాయతీల పరిధిలో 6 వేల ఎకరాల్లో వరి వేస్తున్నట్లు వ్యవసాయశాఖ చెబుతున్నది. చెరువులు, బోరుబావులు ఉన్న రైతాంగం వరి నాట్లు ముమ్మరం చేసింది. గురువారం పొనకల్, దేవునిగూడ, అక్కపెల్లిగూడలో రైతులు, కూలీలు ఇలా వరినాట్లలో నిమగ్నమై కనిపించారు.

## జైత్‌పూర్‌లో జీపీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సర్పంచ్ రేణుక

వాంకిడి, జనవరి 25 : జైత్‌పూర్ గ్రామంలో రూ. 20 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే కోవ లక్ష్మి, వాంకిడి ఎంపీపీ ముండే విమలాబాయి, జడ్పీటీసీ అజయ్‌కుమార్‌తో కలసి గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ సర్కారు ప్రజల సౌలభ్యం కోసం కొత్తగా గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసిందని, దశల వారీగా నూతన జీపీ భవనాలను నిర్మించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుర్నులే రేణుక, సింగిల్ విండో చైర్మన్ జాబోరే పెంటు, ఎంపీడీవో శివకుమార్, జేఈ స్టీవెన్, పంచాయతీ కార్యదర్శి కార్తీక్, బీఆర్ఎస్ యువ నాయకుడు దీపక్, భూదాత చాడీ రామ, గ్రామ పెద్దలు గుర్నులే ఆనంద్‌రావు, కోట శంకర్, కోలే గిర్మాజీ, ఏం.హనుమంతు, సెండే నారాయణ, కోలే తిరుపతి పాల్గొన్నారు.

## వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

పశు యాజమానులకు చెక్కులు అందజేస్తున్న అటవీ శాఖ అధికారులు

సిర్పూర్(టీ), జనవరి 25 : వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యతని సిర్పూర్(టీ) రేంజ్ అటవీ శాఖ అధికారి పూర్ణచందర్‌రావు, తహశీల్దార్ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో అటవీ – వన్యప్రాణుల సంరక్షణపై పశు యజమానులకు, రైతులు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జంతువుల దాడిలో పశువులు మృతి చెందితే అటవీ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం ఇటీవల అటవీ జంతువుల దాడిలో మృతి చెందిన పశువుల యజమానులకు నష్ట పరిహారం చెక్కులు అందజేశారు. మొత్తం 25 మంది పశు యజమానులకు రూ. 5.40 లక్షల చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, విద్యుత్ ఏఈ ఇర్ఫాన్, ఎస్ఐ దీకోండ రమేశ్, మండల కో ఆప్షన్ సభ్యుడు కీజర్‌హుస్సేన్, అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విపత్తులను ధైర్యంగా ఎదుర్కోవాలి

అవగాహన కల్పిస్తున్న బెటాలియన్ సిబ్బంది

మంచిర్యాల అర్బన్, జనవరి 25 : విపత్తులు వచ్చినప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలని ఎన్‌డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ విజయవాడ కమాండెంటు బీటెన్ సింగ్ అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విపత్తులు రెండు రకాలుగా ఉంటాయని, ఒకటి మానవ తప్పిదాల వల్ల కలిగేవని, రెండోది సహజ విపత్తులని వివరించారు. సమయస్ఫూర్తితో వ్యవహరిస్తే ఎలాంటి విపత్తునైనా ఎదుర్కోవచ్చునన్నారు. రోడ్డు ప్రమాదాలు, వరదలు, భూకంపాలు, అగ్ని ప్రమాదాలు, ఆకస్మిక గుండెపోటు తదితర ప్రమాదాలు సంభవించినప్పుడు ఏ విధంగా వ్యవహరించాలో, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. హెచ్ఎం పద్మావతి, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి, ఎంఈవో పోచయ్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## మంచిర్యాలకు కొత్త శోభ

- నేడు మూడు జంక్షన్‌లు ప్రారంభం
- అబ్బుర పరుస్తున్న ఆకృతులు

మంచిర్యాలలోని బెల్లంపల్లి చౌరస్తాలో ఏర్పాటుచేసిన ఆకృతులు

మంచిర్యాలటౌన్, జనవరి 25 : పట్టణంలోని ఐబీ చౌరస్తా నుంచి లక్ష్మీ టాకీసు చౌరస్తా వరకు ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న జంక్షన్‌లతో సరికొత్త శోభ సంతరించుకుంటున్నది. ఇప్పటికే మూడుచోట్ల జంక్షన్‌లు పూర్తికాగా, ఈ నెల 26న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రారంభించనున్నారు. ఒక్కో జంక్షన్ నిర్మాణానికి కేసీఆర్ సర్కారు రూ. కోటి చొప్పున కేటాయించగా, ప్రతి జంక్షన్ దగ్గర వృత్తాకారంలో ఐలాండ్, గ్రీనరీ, శిల్పాలు, లైటింగ్, ఫౌంటెయిన్‌లు నిర్మిస్తున్నారు. ఆయాచోట్ల ఏర్పాటు చేసిన త్రివిధ దళాలకు సంబంధించిన విగ్రహాలు, జాతీయ పతాకం, కుల వృత్తుల ఆకృతులు అబ్బురపరుస్తున్నాయి.

టీటీడీ కల్యాణ మండపం చౌరస్తాలో ఏర్పాటుచేసిన నమూనా

# అక్కడికెళ్తే.. అవినీతితో వెనక్కి..!

## వివాదంలో చెన్నూర్ ఏవో కార్యాలయం

- వ్యవసాయాధికారులపై నిత్యం ఆరోపణలు
- చేరిన కొన్ని రోజులకే వెనుదిరుగుతున్న అధికారులు
- విధుల నుంచి తొలగించడం.. ఆపై ఇన్‌చార్జి బాధ్యతలివ్వడం కామన్
- కమర్షియల్ పాయింట్ కావడమే కారణమా..?
- పట్టించుకోని ఉన్నతాధికారి

మంచిర్యాల అర్బన్, జనవరి 25 : చెన్నూర్ వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలోని చెన్నూర్ ఏవో(వ్యవసాయాధికారి)గా విధుల్లో చేరిన వారంతా నిత్యం ఏదో ఒక అవినీతి ఆరోపణతో వెనుదిరగడం పరిపాటిగా మారుతున్నది. ఏవోను విధుల నుంచి తొలగించినప్పుడల్లా పక్కనే ఉన్న కోటపల్లి మండల వ్యవసాయాధికారికి ఇన్‌చార్జి అప్పగించడం, ఆ విషయం సద్దుమణిగిన తర్వాత మరొకరికి బాధ్యతలివ్వడం ఇక్కడ నిత్యకృత్యమవుతున్నది. ఇక్కడి ఘటనలు బట్టి చూస్తే.. ఇక్కడికి వచ్చే వారంతా అక్రమంగా సంపాదించుకోవడానికేనన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. తాజాగా.. చెన్నూర్ ఏవోగా విధులు నిర్వహిస్తున్న కవిత అక్రమాలకు పాల్పడుతుందని, డీలర్ల వద్ద డబ్బులు వసూలు చేస్తుందనే ఆరోపణల నేపథ్యంలో బుధవారం బాధ్యతల నుంచి తొలగించడం విమర్శలకు తావిస్తున్నది. ఆమెను తిరిగి డీఏవో కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీ చేయడం కొసమెరుపు.

చెన్నూర్ కార్యాలయంలో విచారణ చేపడుతున్న జడ్పీ సీఈవో నరేందర్(ఫైల్)

### కమర్షియల్ పాయింట్ కావడమేనా..

చెన్నూర్ మండలం కమర్షియల్ పాయింట్ కావడంతోనే ఇక్కడ పని చేసేందుకు ఏవోలు పోటీపడుతున్నట్లు సమాచారం. మహారాష్ట్ర సరిహద్దు కావడంతో ప్రజలు అవసరాల కోసం నిత్యం చెన్నూర్‌కు వస్తుంటారు. సీడ్, ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్ పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. మరోవైపు లూజ్ సీడ్, జీరో మాల్ సైతం పెద్ద ఎత్తున ఇక్కడికి వస్తుంటుంది. ఈ దందా నడవాలంటే వ్యవసాయ శాఖ అధికారులకు మామూళ్లు ముట్టచెప్పక తప్పదు. దీంతో ఇక్కడ ఏవోగా పని చేసేందుకు పోటీపడుతుంటారంటారు. ఏడీఏ కార్యాలయంలోనే పక్కనే ఏవో కార్యాలయం ఉంటుంది. డివిజన్ స్థాయి అధికారి చూసీచూడనట్లు వ్యవహరిస్తారని పలువురు చెబుతున్నారు. మరోవైపు సదరు అధికారి చెప్పింది వినకపోతే ఆ ఆఫీసర్‌ను ముప్పతిప్పలు పెడుతుంటారనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. కొందరు ఏఈవోలు కూడా ఆయన చేతుల్లోనే ఉంటారని, ఆయన చెప్పిందే వేదంగా పాటిస్తారని తెలిసింది.

### అసలేం జరుగుతోంది...

జిల్లాలో వ్యవసాయాధికారుల బదిలీలు, అదనపు బాధ్యతలు ఇష్టమొచ్చినట్లు జరిగాయి. ఒకచోట సరెండర్ చేస్తే ఎలాంటి చర్యలు తీసుకోకుండానే మరోచోట బాధ్యతలు అప్పగించడం, నచ్చని వారిని దూరంగా ఉంచడం జరుగుతోంది. గతంలో జరిగిన కొన్ని ఘటనలు పరిశీలిస్తే...

- చెన్నూర్ వ్యవసాయాధికారిగా విధులు నిర్వహించిన ప్రేమ్‌కుమార్ 2018, ఆగస్టులో జనరల్ ట్రాన్స్‌ఫర్‌లలో భాగంగా బెల్లంపల్లికి బదిలీ అయ్యారు. ఆ సమయంలో పక్క మండలమైన కోటపల్లి ఏవో మహేందర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అదే సమయంలో మందమర్రి ఏవో సుజాత ట్రాన్స్‌ఫర్‌లో భాగంగా ఖమ్మం జిల్లాకు వెళ్లగా జైపూర్, భీమారం మండలాలకు ఏవోగా ఉన్న మార్క్ గ్లాడ్సన్‌కి మందమర్రి ఏవోగా ఇన్‌చార్జి ఇచ్చారు.
- 2019 నవంబర్‌లో నెన్నెల ఏవో వంశీ కృష్ణ ఓడీ(ఆఫీసర్ ఆన్ డ్యూటీ) బేసిస్ మీద చెన్నూర్ మండల ఏవోగా వచ్చారు. ఇదే తరుణంలో 2020, జూన్‌లో చెన్నూర్ ఏవోగా ఓడీ మీద పని చేసిన వంశీకృష్ణకి భీమారం మండల ఇన్‌చార్జి ఇచ్చారు. అక్టోబర్‌లో రైతు బీమా డబ్బుల అవకతవకల విషయంలో వంశీకృష్ణ సస్పెండ్ అయ్యారు.
- జైపూర్ ఏవో గ్లాడ్సన్ మందమర్రి ఇన్‌చార్జిగా ఉండగా, 2021లో ఆయన స్థానంలో కాసిపేట ఏవో వందనకి ఇన్‌చార్జి ఇచ్చారు.
- జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో టెక్నికల్ ఏవోగా ఉన్న సుధాకర్‌కి 2022, జూన్‌లో చెన్నూర్ మండల ఏవోగా ఓడీ బేసిస్ మీద ఇచ్చారు. అక్టోబర్‌లో ఈయన కూడా అవకతవకల్లో సస్పెండ్ అయ్యారు. ఈ సమయంలో జిల్లా వ్యవసాయ కార్యాలయంలో టెక్నికల్ ఏవోగా విధులు నిర్వహిస్తున్న కవితకు నవంబర్‌లో చెన్నూర్ మండల ఏవోగా ఓడీ బేసిస్ మీద బాధ్యతలు అప్పగించారు. ఈ సమయంలోనే మందమర్రి ఇన్‌చార్జి ఏవోగా ఉన్న వందన స్థానంలో ఎస్‌టీఎల్ ఏవో రాజేశంకు బాధ్యతలు అప్పగించారు.
- మందమర్రి ఏవో రాజేశం విధుల్లో నిర్లక్ష్యం చేస్తున్నాడని 2023, జూన్‌లో చెన్నూర్ ఏవోగా ఓడీ మీద పని చేస్తున్న కవితకు మందమర్రి ఏవోగా ఇన్‌చార్జి ఇచ్చారు.
- 2024లో చెన్నూర్, మందమర్రి ఏవోగా పని చేస్తున్న కవిత మీద వసూళ్లకు సంబంధించిన ఆరోపణలు రాగా వెంటనే ఓడీ క్యాన్సిల్ చేస్తూ మళ్లీ టెక్నికల్ ఏవోగా ఆర్డర్‌లు ఇచ్చారు. కవిత స్థానంలో కోటపల్లి ఏవో మహేందర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు.
- ఒక చెన్నూర్ మండలం దుగ్నెపల్లి క్లస్టర్‌లో ఏఈవోగా విధులు నిర్వహిస్తూ అనారోగ్య సమస్యలతో కాసిపేట మండలానికి వెళ్లారు. పని ఒత్తిడి భరించలేక కేవలం నాలుగు నెలల తర్వాత తిరిగి దుగ్నెపల్లి క్లస్టర్‌కు వచ్చారు. ఇలా ఎటు పడితే అటు బదిలీలు, ఎప్పుడు పడితే అప్పుడు తిరిగి మరో చోటుకు వెళ్తుండడం చూస్తే అసలు ఆ వ్యవసాయ శాఖ డివిజన్‌లో ఏం జరుగుతుందో తెలియని దుస్థితి.

## గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

మంచిర్యాల అర్బన్ : వేడుకలకు ఏర్పాట్లు

మంచిర్యాల అర్బన్/ఆసిఫాబాద్, జనవరి 25 : మంచిర్యాల పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో, ఆసిఫాబాద్‌లోని పోలీస్ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఉదయం 9.02 గంటలకు మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు బదావత్ సంతోష్, బోర్కడే హేమంత్ సహదేవ రావు జాతీయ పతాకాలను ఆవిష్కరించనున్నారు. ఆపై పోలీసుల గౌరవ వందనం స్వీకరించనున్నారు. స్టాళ్లు, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వివిధ రంగాల్లో కృషి చేసిన వారికి ప్రశంసా పత్రాలు, మెమొంటోలను ప్రదానం చేయనున్నారు. ఆసిఫాబాద్‌లో ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, పాల్వాయి హరీశ్‌బాబు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొననున్నారు.

## గిరిగ్రామాల అభివృద్ధికి కృషి

లోహలో గిరిజనులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎస్పీ

దహెగాం, జనవరి 25 : గిరిగ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎస్పీ సురేశ్‌కుమార్ పేర్కొన్నారు. 'పోలీసులు మీకోసం'లో భాగంగా గురువారం కర్జి పంచాయతీ పరిధిలోని లోహ గ్రామాన్ని ఆయన సందర్శించారు. 23 కుటుంబాలకు సామాజిక చారిటబుల్ ట్రస్టు ద్వారా సమకూర్చిన దుస్తులు, దుప్పట్లు, బియ్యం, ఇతర సరుకులను అందజేశారు. గిరివెళ్లి గెర్రె, కర్జి గ్రామాలకు చెందిన యువకులకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. డీఎస్పీ కరుణాకర్, రూరల్ సీఐ నాగరాజు, ఎస్ఐ సనత్‌కుమార్, సామాజిక కర్యకర్త సరిత పాల్గొన్నారు.

పల్లకిలో దేవతను ఊరేగిస్తున్న భక్తులు

జంగుబాయి వద్ద పూజలు చేస్తున్న ఎంపీ సోయం బాపురావ్

# ఆరాధ్య దైవాలకు మొక్కులు

- జంగుబాయి, కప్లె, సిద్ధికసలో భక్తుల కోలాహలం
- పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివాసుల సంప్రదాయ పూజలు

కెరమెరి, జనవరి 25 : మండలంలోని అటవీప్రాంతంలోగల జంగుబాయి, కప్లెగుహలతో పాటు సిద్ధికసలోని శివలింగం దర్శనానికి ఆదివాసీ భక్తులు పోటెత్తారు. గురువారం పుష్యమాసం పౌర్ణమిని పురస్కరించుకొని ఆరాధ్య దైవాలకు సంప్రదాయ వాయిద్యాల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. జై జంగో.. జై లింగో దీక్ష తీసుకున్న భక్తులు కప్లె వద్ద పుణ్య స్నానాలు ఆచరించి సిద్ధికస శివలింగాన్ని దర్శించుకున్నారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావ్ తన కుటుంబ సభ్యులతో కలిసి జంగుబాయికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కప్లె గుహలో స్నానాలు చేసి శివలింగం వద్ద పూజలు చేశారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ భక్తి మార్గంలో నడవాలని, సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించేందుకు పాటుపడాలని ఎంపీ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తే ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసే అవకాశం ఉందన్నారు. ఉమ్రి నుంచి పరందోలి వరకు రోడ్డు, టొప్లకస వద్ద రూ. 10 లక్షలతో షెడ్డు నిర్మిస్తామని ప్రకటించారు. అనంతరం సిద్ధికసలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర, తెలంగాణ ఆలయ కమిటీ చైర్మన్‌లు వెట్టి చందు, కొడప జాకుతో పాటు నాయకులు నాగోరావ్, కటోడాలు, భక్తులు పాల్గొన్నారు.

గవర్నర్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న కలెక్టర్లు

## కలెక్టర్‌కు ఉత్తమ పురస్కారం

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 25 : 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుకు ఉత్తమ పురస్కారం అందించారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ తమిళిసై కలెక్టర్‌కు ఉత్తమ పురస్కారాన్ని అందజేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంతో పాటు 14వ జాతీయ ఓటరు దినోత్సవంపై విస్తృతంగా ప్రచారం నిర్వహించినందుకుగాను ఈ పురస్కారాన్ని అందించినట్లు కలెక్టర్ తెలిపారు.

ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, అధికారులు

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

# ఓటే వజ్రాయుధం

- ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 25 : ఓటు వజ్రాయుధంలాంటిదని, ప్రతి ఒక్కరకూ ఓటు హక్కు వినియోగించుకోవడం వల్ల సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పేర్కొన్నారు. 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవనం నుంచి చిల్డ్రన్ పార్కు, భీమ్ చౌక్ మీదుగా తిరిగి కలెక్టరేట్ వరకు నిర్వహించిన ర్యాలీలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, ఆర్డీవో కదం సురేశ్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ భవన ఆవరణలో అధికారులు, విద్యార్థులు, కలెక్టరేట్ సిబ్బంది, ప్రజలతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. 18 ఏళ్లు నిండినవారందరూ ఓటరు జాబితాలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించుకున్నామని, ఇదే స్ఫూర్తితో పార్లమెంట్ ఎన్నికలకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా వయోవృద్ధులు, దివ్యాంగ ఓటర్లతో పాటు కొత్తగా ఓటు నమోదు చేసుకున్న వారిని సన్మానించి గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఓటు విలువైనది

నస్పూర్, జనవరి 25 : దేశ పౌరులకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఎంతో విలువైనదని, 18 ఏళ్లు నిండిన వారందరూ జాబితాలో వివరాలు నమోదు చేసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. కలెక్టరేట్‌లో 14వ జాతీయ ఓటరు దినోత్సవంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, డీఆర్‌డీవో శేషాద్రితో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే మన దేశం అతి పెద్ద ప్రజాస్వామ్యం కలిగి ఉందని, 96 కోట్ల మంది ఓటర్లకు 12 లక్షల పోలింగ్ కేంద్రాల ద్వారా ఎన్నికలు నిర్వహించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. అనంతరం అధికారులు, విద్యార్థులు, సిబ్బందితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఓటరు దినోత్సవంపై నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో గెలిచిన వారికి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.